
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 మహబూబాబాద్
శుక్రవారం 4 అక్టోబరు 2024





## పండుగకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 3 : దసరా పండుగకు ఊళ్లకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. పండుగ సెలవులకు ఊర్లకు వెళ్లవలసి వస్తే విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. సెలవుల్లో బయటకు వెళ్తున్నప్పుడు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకోడం మంచిదన్నారు. ఇంటికి సెంట్రల్ లాక్‌సిస్టమ్ ఉన్న తాళాలు అమర్చుకోవాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవ్వరైనా అనుమానాసద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులు, డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకోవాలని చెప్పారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని ఎస్పీ అన్నారు.

# పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా..

**అన్ని మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్-2050**

- వచ్చే యేడాది మార్చి నాటికి రూపకల్పన
- సీఎం సూచనలతో మునిసిపల్ అధికారుల కసరత్తు
- ప్రతిపాదనల రూపకల్పనకు ప్రణాళికలు
- 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో భాగం
- బ్లూ-గ్రీన్, గ్రీన్ మొబిలిటీ, గ్రీన్ ప్రాజెక్టులు సైతం అమలు
- ఇక వరంగల్ మాస్టర్‌ప్లాన్ 2040కి కాలం చెల్లినట్టే!





హనుమకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా..' నినాదంతో అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న వినూత్న కార్యక్రమం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ)తో పాటు తొమ్మిది మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనున్నది. జీడబ్ల్యుఎంసీతో పాటు మున్సిపాలిటీలకు వచ్చే యేడు మార్చికల్లా మాస్టర్ ప్లాన్-2050 తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వరంగల్ కార్పొరేషన్‌తో పాటు మిగతా మున్సిపాలిటీలు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, వర్ధన్నపేట, భూపాలపల్లి మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తొలివిడతగా వరంగల్ కార్పొరేషన్‌తో పాటు మేజర్ మున్సిపాలిటీలైన జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల మున్సిపాలిటీలకు ఈ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నది. రెండో విడతగా మిగతా మున్సిపాలిటీలపై దృష్టి సారించనున్నది.

**సీఎం ఆదేశం మేరకు..**

కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా' గురించి వరంగల్‌లోనే సూత్రప్రాయంగా వెల్లడించారు. వరంగల్ నగరాభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, వరంగల్ నగర పాలక సంస్థ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థతో పాటు ఇతర మునిసిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంతో అర్బన్ అభివృద్ధి నమూనాపై దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే వరంగల్ మహానగర పాలక సంస్థ మాస్టర్-2050 ప్లాన్‌ను తెరమీదికి తీసుకువచ్చారు. ప్రస్తుతం సిద్ధంగా వరంగల్ మాస్టర్ ప్లాన్-2040 ఆమోదానికి సంబంధించిన అంశం చర్చకు వచ్చినప్పుడు సీఎం దీనిని యథాతథంగా ఆమోదించడానికి విముఖత వ్యక్తం చేశారు. పెరిగిన నగర జనాభా, అవసరాల దృష్ట్యా ఈ మాస్టర్‌ప్లాన్‌కు కాలం చెల్లిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ హయాంలో అనుసరించిన అసంబద్ధ అర్బన్ అభివృద్ధి విధానాల వల్ల అంతా అస్తవ్యస్తంగా మారిందని, మాస్టర్‌ప్లాన్ ఆమోదించకుండా పదేళ్లు తొక్కిపెట్టడం వల్ల నగరం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందలేకపోయిందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అర్బన్ ప్రణాళికను అమలు చేయబోతున్నట్టు సూచనాప్రాయంగా తెలియచేశారు. ప్రజల మౌలిక అవసరాలు, భవిష్యత్తులో నగర విస్తరణ, పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్ నగర మాస్టర్‌ప్లాన్-2040ని సవరించి వచ్చే 26 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ -2050ను రూపొందించాలని ఆదేశించారు. అయితే ఇదే అభివృద్ధి నమూనాను ఒక్క వరంగల్ నగరానికే కాకుండా యావత్ తెలంగాణ పట్టణాలకు వర్తించేలా అన్ని మున్సిపాలిటీల్లో అమలుకు కూడా 2050 మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. జీడబ్ల్యుజీఎంసీతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల అధికారులు ఈ దిశగా కసరత్తు చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్ -2050లో చెరువుల అభివృద్ధికి బ్లూ-గ్రీన్, కాలుష్య నివారణకు గ్రీన్ మొబిలిటీ, ఉద్గారాల నివారణకు, సౌరవిద్యుత్ వినియోగం ప్రోత్సహించే దిశగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు భాగంగా ఉంటాయి.

**మునిసిపాలిటీలకు మహర్దశ**

'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో ఉమ్మడి జిల్లాలోని వరంగల్ నగర పాలకసంస్థతో పాటు ఈ తొమ్మిది మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రాధాన్యత లభించనున్నది. వచ్చే యేడు మార్చి కల్లా ఇందుకు సంబంధించి మాస్టర్‌ప్లాన్ -2050 తయారు కానున్నది. రానున్న 26 ఏళ్లలో అభివృద్ధి చెందనున్న పట్టణాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించబోతున్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ)తో పాటు ఈ మునిసిపాలిటీలు ఇందులో భాగం కానున్నాయి. మునిసిపాలిటీల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పట్టణ సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు సూచించింది. మాస్టర్ ప్లాన్ -2050తో జిల్లాలోని మునిసిపాలిటీలకు భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఒన గూరుతాయని అధికారులు వివరిస్తున్నారు. బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలకు కలిపి 2024-26 సంవత్సరాల్లో రూ.13,700కోట్లను వ్యయం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జిల్లాలోని పురపాలికలకూ నిధులు సమకూరుతాయి. దీంతో మౌలిక వసతులు మెరుగుపడతాయి. రాష్ట్రంలో 130 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.350కోట్లను వెచ్చించనున్నది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లోని చెరువుల సంరక్షణకు సింహభాగం నిధులు అందనున్నాయి.

**పలు ప్రాజెక్టులు**

వరంగల్ కార్పొరేషన్‌తో పాటు జనగామ, మహబూబాబాద్ మునిసిపాలిటీలు చాలా పెద్దవి. పైగా వ్యాపారర, వాణిజ్య కేంద్రాలు. గ్రానైట్, లేటరైట్, ఇతరత్రా ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఇక్కడి నుంచి రవాణా అవుతాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని రవాణాపరంగా వాతావరణ కాలుష్యం జరగకుండా నివారించేందుకు బ్లూ-గ్రీన్ ప్రాజెక్టు అమలుకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా మునిసిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతీ పట్టణానికి సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగం చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. ఇందులో భాగంగా ప్రతీ పట్టణంలో బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడుతోంది. బ్లూగ్రీన్ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల్లో ఉన్న గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, వాటి సుందరీకరణతో పాటు వరదల నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, పట్టణాల్లో హరితవనాల పెంపకం వంటివి చేపడతారు. ఇక గ్రీన్ మొబిలిటీ (హరిత రవాణా) ప్రాజెక్టుల్లో భాగంగా వరంగల్ నగరంతోపాటు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి వంటి పెద్ద పట్టణాల్లో విద్యుత్ వాహనాలను పెద్ద ఎత్తున వినియోగించేలా ప్రోత్సహించి కాలుష్యాన్ని తగ్గిస్తారు. అవసరమున్న రద్దీ కూడళ్లలో పెద్దసంఖ్యలో ఫ్లైఓవర్ల నిర్మాణం వంటివి చేపడతారు. గ్రీన్ ఎనర్జీ పట్టణాల పేరుతో ప్రత్యేక ప్రాజెక్టులు కూడా చేపడతారు. నిర్మాణరంగంలో కర్బన ఉద్గారాలు వెలువడకుండా ఆధునాతన పర్యావరణ పరిరక్షణ పరిజ్ఞాన వినియోగం, సౌర విద్యుత్ వినియోగం వంటి గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలు చేపడతారు.

## ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోళ్లు చేయాలి

- ప్రతీ సేకరణ కేంద్రానికి సీరియల్ నెంబరు కేటాయించాలి
- గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మహబూబాబాద్ వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

మహబూబాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని పక్కా కార్యాచరణతో కొనుగోళ్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ సచివాలయం నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్, 2024కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, డీఎస్సీ సర్టిఫికేషన్ వెరిఫికేషన్, అపాయింట్‌మెంట్ ఆర్డర్ల ప్రక్రియపై గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లాల్లో పటిష్టమైన ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో 7 వేలకుపైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ కొనుగోలు కేంద్రానికియ ఒక సీరియల్ నెంబరు కేటాయించాలని చెప్పారు. రైస్ మిల్లులకు తరలించే ధాన్యం బస్తాలపై ఆ సీరియల్ నెంబర్‌ను వేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని, అకాల వర్షాలతో ధాన్యం తడిచి పోకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో వచ్చే ఇబ్బందుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయాలన్నారు. 11062 టీచర్ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించి 1:3 నిష్పత్తిలో 25,239 మందిని ఎంపిక చేసి, ఫలితాలు ప్రకటించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 9090 మంది అభ్యర్థుల సర్టిఫికేషన్ల పరిశీలన పూర్తయిందన్నారు.

నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతగా సేకరణ జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం వేలకోట్లు ఖర్చుచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టిందన్నారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా అధికారులు వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, వి.రాజేశ్వర్, మధుసూదన్‌రాజు, విజయ్‌కుమార్, మరియన్న పాల్గొన్నారు. అనంతరం అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లాలోని సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రతీ కొరుగోలు కేంద్రంలో మౌళిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. సన్నరకం ధాన్యం వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుసాగు చేసిన సన్న రకం, వచ్చిన దిగుబడి వివరాలను ధ్రువీకరించాలని చెప్పారు.

## మార్కెట్లో కూలీల మెరుపు సమ్మె

- గంటపాటు నిలిచిన కాంటాలు

కేసముద్రం, అక్టోబరు 3 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో గురువారం కూలీలు సమ్మె నిర్వహించారు. ఈనెల 1న హమాలీ, దడువాయిలకు కూలీ రేట్లు పెంచి తమకు మాత్రం నిలిపివేశారని ఆరోపిస్తూ కూలీలు పనులకు వెళ్లడం ఆకస్మికంగా బంద్ చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో విన్నర్ లీస్ట్ విడుదలైన వెంటనే తాము ఈరోజు పనిచేయబోమని కూలీలు తేల్చి చెప్పారు. దీంతో సరుకు నింపడం నిలిచిపోయి కాంటాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో వెంటనే మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమ రలింగేశ్వర్‌రావు చొరవ తీసుకొని కూలీలతో చర్చించారు. కూలీ రేట్ల పెంపు విషయం జిల్లా కలెక్టర్ పరిధిలో ఉందని, వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో యథావిధిగా కూలీలు పనుల్లోకి వెళ్లారు. ఈ సమ్మె ఫలితంగా గంటపాటు కూలీలు తమ పనులను నిలిపివేయగా యార్డులో సరుకు తక్కువగా ఉండడంతో కాంటాలపై ఎలాంటి ప్రభావం చూపలేదు.

## అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్



8లో..

మానుకోటలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను పరిశీలిస్తున్న డీఈవో రాజేశ్వర్

## ఇనుగుర్తిలో మండల ఆఫీసులు మంజూరు చేయాలి

- మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే మురళీనాయక్ విజ్ఞప్తి



హైదరాబాద్‌లో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వివరిస్తున్న మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 3 : మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పాటైన ఇనుగుర్తి మండల కేంద్రంలో తహసీల్, ఎంపీడీవో ఆఫీసులు, పోలీస్‌స్టేషన్‌ను మంజూరు చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గురువారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తహసీల్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ కార్యాలయాల భవనాలను మంజూరు, చేసి నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి, నాయకులు నాయిని సత్యపాల్‌రెడ్డి, బాలాజీ, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కోసం ప్రత్యేక బృందాలు

**కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్**

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 3 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు ఇంటింటా సర్వే చేస్తాయని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. మహబూబాబాద్ మునిసిపల్ 7వ వార్డు పరిధిలోని రజాలిపేట, సాలార్ తండాల్లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం జరిగే సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని మునిసిపల్ పరిధిలోని రజాలిపేట, సాలార్‌తండా, దంతాలపల్లి మండలం రామవరం, మరిపెడ మునిసిపల్ పరిధిలోని 14వ వార్డులో డిజిటల్ సర్వే జరుగుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరికి ఒక డిజిటల్ ఐడీ, మొత్తం కుటుంబానికి ఒక డిజిటల్ ఐడీ ద్వారా పూర్తిగా డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం పక్కాగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులను, ప్రత్యేక బృందాలను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మానుకోట మండల తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి**

జిల్లాలోని మునిసిపల్, గ్రామ పంచాయతీ పరిధిల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో బృందాలు పరిశీలించి వెంటన పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి పారుదల శాఖ అధికారులు ఎఫ్టీఎల్, రెవెన్యూ ప్రభుత్వ భూమి, చెరువు శిఖం, దేవాదాయ, నాలా తదితర భూములను పరిశీలించాలన్నారు. మునిసిపల్ సిబ్బంది డాక్యుమెంటేషన్ ప్రకారం పరిశీలించాలన్నారు. దరఖాస్తు దారులకు జాయింట్ సర్వే బృందం ముందస్తు సమాచారం ఇచ్చి క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవాలను గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇబ్బందులు లేకుండా దరఖాస్తులను పరిష్కరించాలన్నారు, ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, హరిప్రసాద్, సాయిరాం పాల్గొన్నారు.

## దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం



మహబూబాబాద్ లెనిన్‌నగర్‌లో ఏర్పాటు చేసేందుకు తీసుకువెళ్తున్న దుర్గామాత విగ్రహం వద్ద ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి ఉమా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 3 : జిల్లా వ్యాప్తంగా దుర్గామాత దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆయా మండపాల్లో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేశారు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాలు, ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏటా ఆశ్వయుజ శుద్ధ పౌడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధనవమి వరకు తొమ్మిదిరోజులు దేవి నవరాత్రులను నిర్వహించిన అనంతరం పదోరోజున విజయదశమిని జరుపుకుంటారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొలువుదీరిన దుర్గామాత తొమ్మిది రోజుల పాటు ఒక్కొక్క వేషధారణతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహిస్తారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాతను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలు, వివిధ గ్రామాలకు వాహనాలపై నిర్వాహకులు అమ్మవారి విగ్రహాలను తీసుకువెళ్లారు. పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం, మహేశ్వరిభవన్ (మార్వాడీసత్రం), శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

**రోజుకో అలంకరణలో అమ్మవారు..**

గురువారం తొలిరోజు శ్రీబాలత్రిపుర సుంధరీదేవి అలంకరణ, 4న శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణ, 5న శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణ, 6న శ్రీ గౌరీదేవి అలంకరణ, 7న శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకరణ, 8న శ్రీగాయత్రీదేవి అలంకరణ, 9న శ్రీసరస్వతీదేవి అలంకరణ, 10న దుర్గాదేవి అలంకరణ, 11న శ్రీమహిషాసురమర్దినిదేవి అలంకరణ, 12న శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు అందుకోనున్నారు.

## పండుగనాటికైనా జీతాలు వచ్చేనా!?

- ఆరు నెలలుగా వేతనాలకు నోచుకోని సీఆర్టీలు
- గిరిజన ఆశ్రమ పాఠశాలలలో విధులు నిర్వర్తిస్తున్న 108 మంది ఉద్యోగులు
- ఉన్నతాధికారులు చొరువ తీసుకోవాలని విజ్ఞప్తి





మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 3 : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ)లు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 108 మంది విధు లు నిర్వర్తిస్తున్నారు. 2004వ సంవత్సరం నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న సీఆర్టీలకు ఆరునెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారింది. ఉద్యోగులు అప్పులు చేసుకొని తమ అవసరాలు వెళ్లదీస్తున్నారు. సీఆర్టీలకు ఏప్రిల్ నెల నుంచి రావాల్సిన వేతనాలు విడుదల చేసి, ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

**జిల్లాలో 108 మంది ఉద్యోగులు..**

జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు 23 ఉండగా, వాటిల్లో 5487 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బాలురు 2,504, బాలికలు 2,983 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 ఆశ్రమ పాఠశాలల్లో 108 మంది కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ విధులు నిర్వహిస్తున్నారు. సీఆర్టీలకు ప్రతీల రూ. 28,977 వేతనం అందిస్తున్నారు. కానీ, గత ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో చేసిన పనికి నెలనెల జీతాలు రాకపోయినప్పటికీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహించాల్సి వస్తోందని వాపోతున్నారు. గిరిజనలు అత్యంత భక్తిశ్రద్ధతలో జరుపుకునే పెద్ద పండుగలైన తీజ్, దాటుడు పండుగలకు కూడా వేతనాలు అందకపోవడంతో అప్పులు తెచ్చుకొని వేడుకలు జరుపుకున్నామని పేర్కొంటున్నారు.

**ఏప్రిల్ నుంచి పెండింగ్‌లోనే..**

మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే తాము కూడా పాఠాలు బోధిస్తున్నామని, ప్రతీనెల వేతనాలు జమ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. రానున్న దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులకు వేతనాలు విడుదల చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి**

**గుగులోతు చిట్టిబాబు, సీఆర్టీపీఆర్టీయూ-టీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు**

గత ఆరునెలల నుంచి వేతనాలు రాక కుటుంబ పోషణ భారమవుతోంది. సెప్టెంబరు నెల వేతనంతో పాటు పెండింగ్ వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలి. గత కొన్ని నెలలుగా వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వేతనాలు విడుదల చేయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## ప్రసూతి ఆస్పత్రి
# సూపరింటెండెంట్ పోస్టుపై అనిశ్చితి

వరంగల్ మెడికల్, అక్టోబరు 3: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉన్నట్లా? లేనట్లా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన విజయలక్ష్మీ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకోగా, డీఎంఈ సానుకూలంగా స్పందించలేదని తెలిసింది. కాగా, ఇటీవలే ఇక్కడికి ప్రొఫెసర్‌గా బదిలీపై వచ్చిన డాక్టర్ రాజేశ్వరిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగాలని డీఎంఈ ఆదేశించారు. అయితే సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకోలేనని డీఎంఈకి మొరపెట్టుకున్నట్లు తెలిసింది. డాక్టర్ విజయలక్ష్మి సెలవుపై వెళ్లడం, కొత్తగా డాక్టర్ రాజేశ్వరికి సూపరింటెండెంట్‌గా బాధ్యతలను తీసుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో జీఎంహెచ్ పాలన అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.











# నేడే కేయూ కొత్త వీసీ ఎంపిక

- సెక్రటేరియెట్‌లో సెర్చ్ కమిటీ కీలక సమావేశం
- వీసీ పదవిపై గంపెడాశలతో ఆశావహులు
- హైదరాబాద్‌లోనే తిష్ట వేసి గాడ్ ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కాకతీయ యూనివర్సిటీకి కొత్త వైస్ చాన్స్‌లర్ ఎంపిక ప్రక్రియ తుది ఘట్టానికి చేరింది. ఈనెల 4న శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. గతంలో వెలువరించిన నోటిఫికేషన్ మేరకు కేయూ వీసీ పదవి కోసం వర్సిటీలో పనిచేస్తూ 10 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రొఫెసర్లు, రిటైర్డు ప్రొఫెసర్లతో పాటు ఇతర వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో సరైన అర్హతలు, సామాజిక సమీకరణాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు అనుభవజ్ఞులైన ముగ్గురిని వీసీ పదవికి సెర్చ్ కమిటీ తుది ఎంపిక చేస్తోంది. కేయూ వీసీ పదవికి సెర్చ్ కమిటీ సభ్యులు వచ్చిన దరఖాస్తుల్లోంచి ముగ్గురిని అర్హతల మేరకు ఎంపిక చేస్తారు. తుది ఎంపికలో ఖరారైన ముగ్గురి పేర్లను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారు. గవర్నర్ సీఎం ఆమోదంతో సీల్డ్ కవర్‌లోని ముగ్గురిలో ఒక్కరిని వీసీగా ప్రకటిస్తారు. అన్ని అనుకున్నట్లు జరిగితే వారం, పది రోజుల్లో వర్సిటీకి కొత్త వీసీ బాధ్యతలు చేపట్టనున్నారు.

## గంపెడాశతో ప్రొఫెసర్లు

కేయూ వీసీ పోస్టుపై గంపెడాశతో ఎందరో అర్హులైన ప్రొఫెసర్లు ఎదురు చూస్తున్నారు. తమకు తెలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు తమ సామాజిక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులతో ఇప్పటికే పైరవీలకు దిగారు. గతంలో వర్సిటీలో నిర్వహించిన పదవులు, ఇతర అనుభవాలతో పాటు, సామాజిక, రాజకీయ అర్హతలను విన్నవిస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. తమకు దగ్గరైన గాడ్‌ఫాదర్ల చుట్టూ తిరుగుతూ ముమ్మరంగా పైరవీలు చేసుకుంటున్నారు. సర్వీసులో ఉన్న వారితో పాటు రిటైర్డు ప్రొఫెసర్లు ఈ దఫా వీసీ పదవికి తీవ్రంగా పోటీ పడుతున్నారు.

## ఎస్సీ లేదా ఓసీలకు అవకాశం

కేయూకు ఈ దఫా వచ్చే వీసీ ఎస్సీ లేదా ఓసీ వర్గాలకు చెందిన వారే వస్తారని అంచనా వేస్తున్నారు. గతంలో బీసీ వర్గానికి చెందిన ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం వీసీగా అవకాశం కల్పించింది. అంతకుముందు రెండు దఫాలుగా ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన ప్రొఫెసర్ బి.వెంకటరత్నం, ప్రొఫెసర్ ఆర్.సాయన్నలకు అవకాశం కల్పించింది. ఈ దఫా మళ్లీ ఎస్సీకి అవకాశం ఇస్తారా..? ఓసీ వర్గాలకు ఇస్తారా ? అనే అంశంలో సందిగ్ధత నడుస్తోంది. ఓసీ వర్గాల నుంచి ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి వైఎస్ఆర్ హయాంలో వీసీగా సేవలందించారు. అయితే రాష్ట్రంలోని 10 వర్సిటీల్లో సామాజిక సమీకరణాలు కలిసి రాకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో కేయూ వీసీ పదవి బీసీలకు వచ్చే అవకాశం వుంది.

## సమర్థులకు అవకాశం వచ్చేనా ?

కేయూ వీసీ ఈ దఫానైనా సమర్థవంతులైన వారికి తగ్గుతుందా ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గత వీసీ పాలనలో వర్సిటీ అభాసుపాలైంది. అదే క్రమంలో వర్సిటీ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా మాజీ వీసీ తాటికొండ రమేశ్ అపఖ్యాతి పాలయ్యారు. విజిలెన్స్ విచారణలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సందర్భంలో కేయూ సమర్థవంతులైన వారే వీసీగా రావాలని వర్సిటీ అధ్యాపక వర్గాలు భావిస్తున్నాయి. వర్సిటీలో పరిపాలన, బోధన, బోధనేతర సమస్యలతో పాటు సంస్థాగతమైన అనేక ఇబ్బందులున్నాయి. రీసెర్చ్‌తో పాటు క్లాస్‌వర్క్‌లోనూ వెనుకబడింది. వీటన్నింటినీ అధిగమించాలంటే సమర్థవంతులైన వీసీ రావాలనే భావన విద్యావేత్తల్లో నెలకొంది.

## సెర్చ్ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారితో పాటు మరో ఇద్దరు సభ్యులతో సెర్చ్ కమిటీని నియమించారు. కేయూ సెర్చ్ కమిటీలో జమ్మూ కశ్మీర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ సంజీవ్ జైన్, వర్సిటీ పాలక మండలి నామినీ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎ.దామోదర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారిలు సభ్యులుగా ఎంపికయ్యారు.

# పీహెచ్‌డీ సీట్ల కోసం ఆందోళనలు

- సెల్ టవర్ ఎక్కి విద్యార్థుల నిరసన
- సర్ది చెప్పిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి, డీన్లు, అధికారులు


సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కేయూలో పీహెచ్‌డీ సీట్ల అడ్మిషన్లలో న్యాయం చేయాలని కోరుతూ గురువారం విద్యార్థులు నిరసన, ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ ఏకంగా వర్సిటీ పరిపాలన భవనంలో పురుగుల మందుల డబ్బాలను పట్టుకుని హల్‌చల్ చేశారు. అలాగే వర్సిటీలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి దిగడంతో కొద్దిసేపు వర్సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వర్సిటీ పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్లలో తమకు న్యాయం చేయాలని అనేక దఫాలుగా జిల్లా మంత్రులు, కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్ల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. దీంతో తమకు అడ్మిషన్లలో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గతంలో పీహెచ్‌డీ సీట్ల కోసం తాము ఆందోళనలు చేశామని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణలు కల్పించుకుని పీహెచ్‌డీ ఆశావహులైన మిగతా విద్యార్థులకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్‌కు అప్పగిస్తే పట్టించుకోకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

విద్యార్థులను మానసికంగా వేధిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ఈసీ మెంబర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ చిర్ర రాజులు ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చి సముదాయించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా, శాంతించి సెల్ టవర్ దిగారు. ఈ నిరసన ఆందోళనల్లో పీహెచ్‌డీ ఆశావహులైన మంద నరేశ్, బొట్ల మనోహర్, బందిగ రాకేశ్, తిరుపతి నాయక్, సోరుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# హీరో గ్లామర్ ఓజీ ఆవిష్కరణ


హీరో గ్లామర్ ఓజీని ఆవిష్కరిస్తున్న చందుపట్ల సత్యపాల్‌రెడ్డి

బాలసముద్రం, అక్టోబరు 3: హనుమకొండ శ్రీ వైష్ణవి ఆటోమొబైల్స్ షోరూమ్‌లో హీరో గ్లామర్ ఓజీ (ఒరిజినల్)వాహనాన్ని గురువారం షోరూమ్ అధినేత చందుపట్ల సత్యపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వాహనం ప్రత్యేకతలు గురించి తెలియజేశారు. గ్లామర్ ఓజీ 125 సీసీ హెచ్చు సింబల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్, హెడ్ ల్యాంప్, ఫుల్లీ డిజిటల్ స్పీడ్ మోటార్స్, ఇండికేట్స్, ఇండికేటర్ హాజార్డ్ స్విచ్, అలాగే సెల్ఫ్ స్టార్ట్ ఇంజన్, కట్ ఆఫ్ స్విచ్ ఈ వాహన ప్రతేకతలని తెలిపారు.

లీటర్‌కు మైలేజీ 65 కిలోమీటర్లు వస్తుందన్నారు. ఈ పండుగకు రెగ్యులర్ గ్లామర్ వాహనాలకు 3000 నుంచి 5000 వరకు నగదు బెనిఫిట్స్ ఇస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ ఆఫర్లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మధు, సర్వీసు మేనేజర్ జబ్బార్, ఫైనాన్షియర్స్, ఇన్సూరెన్స్ మేనేజర్స్ కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

# సందడిగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 3: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు సందడిగా గురువారం ప్రారంభమయ్యాయి. జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో 40మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజేందర్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి క్రీడాకారులను ఈనెల 5, 6 తేదీలలో హైదరాబాద్ షేక్‌పేటలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని బాక్సింగ్‌హాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, సభ్యులు గిరిధర్, రఘు, కృష్ణమూర్తి, సీనియర్ బాక్సర్లు రెహాన్, దివ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రేపు పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలం

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలను శనివారం వేలం వేయనున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రిపేర్ చేయబడిన బ్యాటరీలు, టైర్లు, విడిభాగాలను వేలంలో అందుబాటులో ఉంచుతామని, ఆసక్తి గల వ్యక్తులు శనివారం ఉదయం 10 గంటలకు కమిషరేట్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీస్ (యంటీవో)లో సంప్రదించాలన్నారు.

# కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


వరంగల్ జిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 3: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. ఈ నెల 5 వరకు ఈ పరిశీలన కొనసాగనుంది. గురువారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనలో వరంగల్ జిల్లాలో ఎస్జీటీలకు సంబంధించిన 372మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలనను పూర్తిచేసినట్లు డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన 10అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేశామన్నారు.

మొత్తం 382 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. ఇక హనుమకొండ జిల్లాలో మొత్తం 233 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. కాగా, రాష్ట్ర పరిశీలకురాలు జేడీ విజయలక్ష్మి ప్రభుత్వ డైట్ కళాశాల, సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరిశీలన కేంద్రాలను సందర్శించారు. సర్టిఫికెట్ల పరిశీలన తీరును ఆమె డీఈవోలను అడిగి తెలుసుకుని సమీక్షించారు.

# సెమీ ఫైనల్స్‌కు చేరిన కరీంనగర్, ఖమ్మం జిల్లా జట్లు

## కొనసాగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు


98 బాల్స్‌లో 137 పరుగులు సాధించిన విక్రాంత్

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 3: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. పూల్ బీలోని ఖమ్మం - నిజామాబాద్ జట్ల మధ్య గురువారం కోమటిపల్లి క్రీడామైదానంలో నిర్వహించిన కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నిజామాబాద్ జిల్లా జట్టు నిర్ణీత 45 ఓవర్లను ఎదుర్కొని 207భారీ స్కోరును సాధించింది. నిజామాబాద్ జట్టు ఓపెనర్ ప్రతాప్ 48పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ విక్రాంత్ రెడ్డి 98 బంతులను ఎదుర్కొని 11 బౌండరీలు, 11 సిక్సర్లతో 137 పరుగులు జట్టుకు అందించి భారీ పరుగుల విజయ లక్ష్యన్ని ఖమ్మం జట్టు ముందుంచాడు. కాగా, 208 పరుగుల భారీ లక్ష్య సాధనలో బ్యాటింగ్ బరిలోకి దిగిన ఖమ్మం జట్టు బ్యాట్స్‌మెన్లు దివిన్ 75 పరుగులు, రత్న ఆర్యన్‌ల 45 పరుగులతో రాణించారు. ఇదే జట్టులోని బౌలర్ ధృవతేజా 4వికెట్లు తీసి ప్రత్యర్థి నిజామాబాద్ జట్టు పరుగులను కట్టడి చేయడంతో పాటు 8వ డౌన్ బ్యాటింగ్ బరిలోకి దిగి 26 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో తమ జట్టు విజయంలో కీలక భూమిక పోషించి ఖమ్మం జట్టు సెమీస్ చేరడంతో కీలక భూమిక పోషించాడు. అదేవిధంగా పూల్ బీలోని ఆదిలాబాద్ - కరీంనగర్ జట్ల మధ్య వరంగల్‌లోని మొగిలిచర్ల క్రీడా మైదానంలో నిర్వహించిన పోరులో 63పరుగుల భారీ తేడాతో ఆదిలాబాద్ జట్టుపై కరీంనగర్ జట్టు విజయం సాధించింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50ఓవర్లకు గాను 46.3 ఓవర్లను ఎదుర్కొని 165 గౌరవప్రదమైన పరుగులు సాధించి ఆలౌట్ కాగా, ఇదే జట్టుకు చెందిన బ్యాట్స్‌మెన్ విజ్ఞన్ 59పరుగులతో రాణించాడు. తదుపరి 166 పరుగుల లక్ష్య చేదనలో బరిలోకి దిగిన ఆదిలాబాద్ జట్టు కేవలం 32. 3ఓవర్లను ఎదుర్కొని 102 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో 63 పరుగుల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై కరీంనగర్ జిల్లా జట్టు విజయకేతనం ఎగరవేసి సెమీ ఫైనల్‌కు చేరింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు మట్టెడకుమార్ బండారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

# బాలత్రిపుర సుందరిగా భద్రకాళి

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ
- అమ్మవారికి బంగారు కిరీటం అలంకరణ

వరంగల్ కల్చరల్, అక్టోబరు 3: స్వయంభూగా కొలువుదీరిన ఓరుగల్లులోని చరిత్రాత్మకమైన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలిరోజు శైలిపుత్రి క్రమంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీగా అలంకరించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిత్య, గణపతి, గురుపూజలతో పాటు సుగంధ పరిమళ పూర్ణాభిషేకం, నవరాత్రి వ్రతం ఆరంభం, ధ్వజారోహణం, కలశస్థాపన చేశారు. వీటితో పాటు చండీహోమం, వేద పారాయణం, లక్ష్మీనారాయణ, వనదుర్గా, దేవీ భాగవతం, సుందర కాండ, శ్రీమద్భాగవతం పారాయణాలు, విశేషపూజలు, మహా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన బంగారు కిరీటాన్ని బ్యాంకు నుంచి తీసుకొచ్చి అలంకరించారు. ఉదయం అమ్మవారు వృషభ వాహనంపై ఊరేగగా సాయంత్రం 7 గంటలకు యోగా నిద్రాక్రమంలో మృగజింక వాహనంపై అమ్మవారు ఊరేగారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో శేషు భారతి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, కూచన హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నైపుణ్యత పెంపొందించుకోవాలి

## వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: పోలీసు అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తిలో నైపుణ్యత సాధించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆవరణలో గురువారం జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా నేరస్థులను త్వరితగతిన పట్టుకోవడంతో పాటు ప్రజలకు సత్వరమే న్యాయం అందించగలరన్నారు. కాగా, ఈ మీట్‌లో అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో చేపట్టే ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో విభాగాల వారీగా ప్రతిభ చూపిన ఇద్దరిని ఎంపిక చేసి ఈ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రథమ పోలీస్ డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు. ఈ మీట్‌లో జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు పాల్గొన్నారు.

# రూ.10 లక్షల గుట్కాల పట్టివేత

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కాలను పెద్ద మొత్తంలో నిల్వ చేసి గుట్టుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వ్యక్తుల నుంచి రూ.10లక్షల విలువ చేసే గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే పక్కా సమాచారం మేరకు కుమారపల్లి మార్కెట్‌లోని లక్ష్మీ జనరల్ స్టోర్ నిర్వహకుడు రాజ్‌పురోహిత్ నుంచి రూ. 6,04,800 విలువ చేసే వివిధ నిషేధిత గుట్కాలు, శివమ్ జనరల్ స్టోర్స్ నిర్వాహకుడు కిరణ్ నుంచి రూ.3,58,300 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో..

హనుమకొండ టౌన్ : ఏనుమాముల పీఎస్ పరిధిలో కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం భారీ మొత్తంలో గుట్కాలను పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. పక్కా సమాచారం మేరకు గురువారం వరంగల్ ఎన్టీఆర్ నగర్‌లో హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగపూర్‌కు చెందిన గుట్కా సరఫరాదారుడు రావి శ్రీధర్, స్థానికుడైన పాన్‌షాపు నిర్వాహకుడు గుండ క్రిష్ణల నుంచి రూ.8,91,100 విలువ చేసే గుట్కాలను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

# దండకారణ్యంలో ఏం జరుగుతోంది ?

- కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టులు సమావేశం!
- చర్చనీయాంశంగా మారిన మావోయిస్టుల రాక
- పోలీసుల ఆరా

వాజేడు, అక్టోబరు 3: దండకారణ్యం నివురుగప్పిన నిప్పులా ఉంది. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించినట్టు ప్రచారం జరుగుతోంది. మండలంలోని కోయవీరాపురం అడవుల్లో నాలుగు రోజుల క్రితం మావోయిస్టులు సమావేశమైనట్టు సమాచారం. గ్రామంలోకి సాయుధులైన మావోయిస్టులు అర్ధరాత్రి వేళ ప్రవేశించి సమావేశం నిర్వహించినట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు కోయవీరాపురంలో భేటీ అయి తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. ఓ వైపు డీజీపీ తెలంగాణలో మావోయిస్టులు లేరని ప్రకటనలు చేస్తున్న క్రమంలో ఏజెన్సీ మండలమైన వాజేడులో మావోయిస్టులు ఈ సమావేశం నిర్వహించారనే విషయం సంచలనంగా మారింది. మావోయిస్టులు తమ పార్టీ కార్యకలాపాలను చాపకింద నీరులా నిర్వహిస్తున్నట్టు తెలుస్తుండగా ప్రశాంతంగా ఉన్న వాజేడు మండల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

కొన్నేళ్లుగా వాజేడులో మావోయిస్టుల కార్యకలాపాలు స్తబ్దుగా ఉన్న నేపథ్యంలో తాజా సంఘటన టార్గెట్‌గా ఉన్న నేతలను కలవరపెడుతోంది. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకుల్లో ఆందోళన నెలకొన్నట్టు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం, జిల్లాలోని వెంకటాపురం(నూగూరు) సరిహద్దు అడవుల్లో మావోయిస్టుల కార్యకలాపాలు అధికంగా ఉంటాయి. ప్రస్తుతం వాజేడు మండలంలో మావోయిస్టులు సమావేశం నిర్వహించడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దండకారణ్యంలో ఏం జరుగుతుందోనని సరిహద్దు గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

## పోలీసుల అదుపులో గిరిజనులు ?

కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టులు సమావేశం నిర్వహించారనే అంశంపై పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల సమావేశం ఆలస్యంగా పోలీసుల చెవిన పడడంతో తమకు ఉన్న నిఘా వ్యవస్థతో వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. కోయవీరాపురానికి చెందిన ఓ 10 మంది గిరిజనులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. మావోయిస్టుల సమావేశంలో పాల్గొన్నారా.. ? లేదా సహకరించారా ? అని ఆరా తీస్తున్నట్లు సమాచారం. సీఐతో పాటు పలువురు ఎస్సైలు ఈ కీలక ఘటనపై వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిసింది. మావోయిస్టులు, పోలీసుల మధ్య అమాయక గిరిజనులు నలుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతుండగా మావోయిస్టుల సమావేశంపై ఇప్పటి వరకు పోలీసు వర్గాలు అధికారికంగా ధ్రువీకరించలేదు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం సర్వే షురూ

- పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన మానుకోట మునిసిపాలిటీలోని 7వ వార్డు
- సాలార్‌తండా, రజాలిపేటలో కుటుంబ సర్వే


సాలార్‌తండాలో సర్వే నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు, పర్యవేక్షిస్తున్న ఆర్డీవో అలివేలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 3 : రాష్ట్రంలోని ప్రజలందరికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబసభ్యుల వివరాలు, హెల్త్ ప్రొఫైల్‌ను కూడా పొందుపర్చనున్నారు. ఆ కార్డు ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎంపిక చేయనున్నారు. అందుకోసం ప్రతీ అసెంబ్లీ నియోజవర్గంలో రెండేసి గ్రామాలను ఎంపిక చేసి సర్వేను ప్రారంభించారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఒకటి గ్రామం, మరోకటి పట్టణాన్ని ఎంపిక చేశారు. అందులో భాగంగా మానుకోట నియోజకవర్గ పరిధిలో స్థానిక మునిసిపల్ ఏడవ వార్డు, మహబూబాబాద్ మండలం సంద్రాల గూడెం గ్రామాన్ని ఎంపిక చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ఏడవ వార్డులో సాలార్‌తండా, రజాలిపేట ఉంది. అందులో సుమారు 500 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ కుటుంబాలను సర్వే చేసేందుకు ఐదు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక టీంకు మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, రెండోటీంకు మునిసిపల్ డీఈ ఉపేందర్, మూడోటీంకు స్థానిక తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, నాలుగో టీంకు గూడూరు ఎంపీడీవో వీరస్వామి, ఐదవ టీంకు లీడర్‌గా నెల్లికుదురు ఎంపీడీవో బాలరాజు నియమించారు. వారికి ఇద్దరు అసిస్టెంట్‌లు వార్డు అధికారి, బిల్ కలెక్టర్‌ను కేటాయించారు. ఒక్కో బృందానికి సుమారు 100 కుటుంబాల చొప్పున కేటాయించగా గురువారం ఆయా బృందాల సభ్యులు కుటుంబ సర్వేను ప్రారంభించారు. కుటుంబసభ్యుల ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుటుంబసభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. సదరు సర్వేను మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ నోడల్ అధికారి, ఆర్డీవో అలివేలు పర్యవేక్షించారు. ఐదు రోజుల్లో సర్వేను పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ఆర్డీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

# పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం

- దొంగను అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 3 : పది ద్విచక్ర వాహనాలు దొంగిలించిన దొంగను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని టౌన్‌పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. టౌన్ ఎస్సై విజయ్‌కుమార్ గురువారం సాలార్‌తండ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా అటుగా వస్తున్న ద్విచక్రవాహనదారుడు పోలీసులను చూసి పారిపోతుండగా అతన్ని వెంబడించి పట్టుకున్నట్లు చెప్పారు. ఆపై విచారించగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నారాయణపురం శివారు దారావత్ తండాకు చెందిన దారావత్ భావ్‌సింగ్ కూలీ పనిచేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన భావ్‌సింగ్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, నెఫ్రూరా సెంటర్, కురవి వీరభద్రస్వామి దేవాలయ గుడివద్ద చుట్టు పక్కల తాళాలు వేసి ఉన్న పలు ద్విచక్ర వాహనాలు దొంగిలించి అందులో ఆరు ద్విచక్రవాహనాలను తక్కువ ధరకు విక్రయించాడని చెప్పారు. మరో నాలుగు ఇంటివద్దనే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆరు ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసిన వ్యక్తులను కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. కొద్ది రోజులుగా భావ్‌సింగ్ భార్య అతన్ని వదిలి వెళ్లిపోయిందని అప్పటి నుంచి జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతూ వాటిని విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నట్లు చెప్పారు. దొంగలు నుంచి లేదా కొత్తవ్యక్తుల నుంచి తక్కువ ధరకు ఎవరైనా దొంగ వస్తువులను కొనుగోలు చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసులో దొంగను పటుకున్న టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై విజయ్‌కుమార్, సిబ్బందిలను డీఎస్పీ రివార్డుతో అభినందించారు.

# రైతు రుణమాఫీపై నేడు బీఆర్‌ఎస్ ధర్నా

**హాజరు కానున్న మాజీమంత్రి హరీశ్‌రావు**



మాట్లాడుతున్న మాజీమంత్రి దయాకర్ రావు

తొర్రూరు, అక్టోబరు 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తుందని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం తొర్రూరులోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల్లో రెండు లక్షల రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సాధ్యంకాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, వెంటనే రైతు రుణమాఫీ, రైతు బంధు, పెన్షన్లు, అర్హులైన మహిళలకు 2500 భృతి చెల్లించాలన్నారు. నియోజకవర్గస్థాయిలో శుక్రవారం జరిగే ధర్నాకు మాజీమంత్రి హరీశ్‌రావు హాజరవుతారని నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు డాక్టర్ సోమేశ్వర్‌రావు, అంజయ్య, సీతారాములు, ఐలయ్య, వెంకన్న, బిందు శ్రీను, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దు : ఎస్పీ

- జిల్లాలో ఒక్కరోజులో 128 కేసులు నమోదు
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


టౌన్ రాణాలో నెంబర్ ప్లేట్‌లేని వాహనాలకు నెంబర్‌ప్లేట్ పెట్టిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు3 : మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, త్రిపుల్ రైడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవ్ చేయడం, హెల్మెట్, నెంబర్ ప్లేట్‌లేని వాహనాలపై జిల్లా పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఒక్కరోజులోనే 128 కేసులు నమోదు చేశారు. మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులను ఆయా పోలీస్‌స్టేషన్‌లకు పిలిపించి, కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల ఎంతోమంది పిల్లలు ప్రమాదాల బారినపడి చనిపోవడం, క్షతగాత్రులు కావడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియనిబంధనలను పాటించాలన్నారు. ఒకరోడ్డు ప్రమాదం ఓ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేస్తుందని, కారణంలేని మరణం ఒక రోడ్డు ప్రమాదమని, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు తెలియని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు.

## 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత : ఎస్సై

డోర్నకల్, అక్టోబరు 3 : అక్రమంగా తరలిస్తున్న 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. బుధవారం రాత్రి డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జగ్జీవన్ రాం విగ్రహం వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా అటుగా వచ్చిన బొలేరో వాహనాన్ని తనిఖీ చేయడంతో అందులో 40 సంచుల్లో బియ్యం ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు బాధ్యులైన పెంద్ర రామారావు, లింగనబోయిన నాగేష్‌ను అదులోపులోకి తీసకుని బియ్యంతో పాటు రవాణాకు ఉపయోగించిన బొలేరో వాహనాన్ని సీజ్ చెప్పారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నెల్లికుదురు, అక్టోబరు 3 : ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నైనాలలో గురువారం జరిగింది. ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు కథనం ప్రకారం. ఏర్పుల వెంకటమల్లు (40) ఓ గ్రానైట్ క్వారీలో లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. రెండునెలల క్రితం ప్రమాదవశాతు లారీటైర్ల కింద చెయ్యి పడటంతో వేళ్లు విరిగిపోయాయి. దీంతో ఇంటివద్దనే ఉంటున్నాడు. పని చేకలేక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో గ్రామశివారులో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సరిత, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టు మార్టంకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

## 'అభ్యర్థులు ఆందోళన చెందొద్దు'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 3 : డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలినకు వచ్చే అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకుగురికావాల్సిన అవసరంలేదని డీఈవో రాజేశ్వర్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఫాతిమా హైస్కూల్‌లో రెండోరోజు గురువారం కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 381 ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, తెలుగు, హిందీ పండిట్, పీఈటీ పోస్టులకు 960 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలినకు హాజరు కావాల్సి ఉండగా 571 మంది హాజరైనట్లు తెలిపారు. ఇంకా 389 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలి చేసుకోవాల్సి ఉందని, ఈనెల 4న కూడా హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలనలో 20 టీంలతో పాటు ఏసీజీఈ మందుల శ్రీరాములు, డీఎస్వో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకం... సేవా గుణం..

- ఇంటినే నందనవనంగా మార్చిన యువకుడు
- పూలు, పండ్లు, కూరగాయలు అన్నీ పేరట్లోనే సేద్యం
- విద్య, వైద్యం, ఆధ్యాత్మికతకు తన వంతు సాయం చేస్తున్న వన ప్రేమికుడు సతీష్


క్యాన్సర్ బాధితురాలు పాడుగు సోమక్కకు ఆర్థిక సాయం అందిస్తున్న బుడిగే సతీష్ (ఫైల్)


బ్రహ్మణపల్లిలోని తన నందనవనంలో సతీష్, ఆయన తల్లిదండ్రులు


బ్రహ్మణపల్లిలో సతీష్ తన వ్యవసాయ భూమిలో పెంచుతున్న రకరకాల చెట్లు

గూడూరు, అక్టోబరు 3 : ఆ ఇంట్లో అడుగు పెడితే చాలు.. పచ్చని చెట్లు.. అందమైన పూలు.. ఆహ్వానం పలుకుతాయి. చల్లని గాలి.. ఆహ్లాదకరమైన వాతావరణం మనసును తాకుతుంది. అంతలా ఆ ఇంటిని నందనవనంలా మార్చుకున్నాడో వనప్రేమికుడు. ఇంటి ఆవరణలో వివిధరకాల వృక్షాలు, కూరగాయలు, ఆకుకూరల తోటలు పెంచుతున్నాడు. ఏకంగా వెయ్యికి పైగా రకాల చెట్లు, మొక్కలను సాదుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రహ్మణపల్లికి చెందిన యువకుడు బుడిగ సతీష్. గూడూరు-మహబూబాబాద్ ప్రధాన జాతీయ రహదారిలో ఉండే బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన సతీష్ సతీష్ ఇంటి నిర్మాణం ప్రారంభించగానే బోరు తవ్వించి మొక్కలు నాటడం ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం అవన్నీ వృక్షాల్లా ఎదిగి ఫలాలు, నీడను ఇస్తున్నాయి. సతీష్ కుటుంబసభ్యులు చెట్ల కిందనే కూర్చొని సేదతీరుతూ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

**ఆ ఇంట్లో ఏమేమి మొక్కలున్నాయంటే..**

వన ప్రేమికుడు సతీష్‌గౌడ్ ఇంట్లో మామిడి, అరటి, సపోట, నేరేడు, ఉసిరి, కొబ్బరి, జామ, టేకు, వేప, రాగి, తులసి, నిమ్మ, శ్రీగంధం, ఎర్రచందనం, గిరకతాళ్లు, రామ సీతఫలం, బత్తాయి, సంత్ర, ద్రాక్ష, దాచినచక్క, నారింజ, గులాబీ, నూరువారాలు, పారిజాత, తెల్లగన్నేరు, బ్రహ్మ పుష్పం చెట్లతో పాటు వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరల పాదులు కూడా ఉన్నాయి. రైతు కుటుంబానికి చెందిన ఆయనకు చెట్లం టే ప్రాణం, సుమారు ఎకరం విస్తీర్ణంలో ఇళ్లు కట్టుకుని చెట్లను పెంచుతున్నాడు. పెరట్లో కావాల్సినంత జాగ ఉంది. అందులో కూరగాయలను పండిస్తున్నారు. కూరగాయలు, ఫలాలతో పచ్చళ్లు పెట్టుకుంటాం. ఏ వేసవిలో చెట్ల నీడన ఆహ్లాదకరమైన వాతావరణంలో విశ్రాంతి తీసుకుంటున్నామని, ప్రతిరోజు ఉదయం గంట, సాయంత్రం మరో గంటతోటలో పనిచేస్తామని చెబుతున్నాడు సతీష్‌గౌడ్. దీంతో మొక్కలను పెంచి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు సతీష్

**సతీష్ చేసిన సేవా కార్యక్రమాలు..**


వయానాడ్ వరద బాధితుల సహాయార్థం మంత్రి సీతక్కకు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న బుడిగే సతీష్ (ఫైల్)

వనప్రేమికుడిగానే కాదు సామాజిక సేవలోనూ సతీష్ భేష్ అనిపించుకుంటున్నాడు. కొవిడ్ సమయంలో పేదలను గుర్తించి, వారికి నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సాయం అందించారు. గూడూరు మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన గిరిపుత్రిక కొట్టెం కుసుమాంజలి మెడిసిన్‌లో సీటు సాధించడంతో ఆమెకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కొత్తగూడ మండలం వేలుబెల్లి తండాకు చెందిన మాటలు రాని దివ్యాంగురాలు ఓ ప్రమాదంలో శరీరం కాలిపోవడంతో ఆమె వైద్యం కోసం రూ.20 వేలు అందించారు. గూడూరు మండలం ఉప్పల్‌తండాలో దుర్గమ్మగుడి నిర్మాణానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. వయానాడ్ వరదబాధితులకు మంత్రి సీతక్క ద్వారా రాహుల్‌గాంధీకి రూ.50 వేల చెక్కును అందించారు. గత సంవత్సరం ములుగు జిల్లా వరద బాధితులకు తన స్నేహితుల సాయంతో 20 క్వింటాళ్ల బియాన్ని బాధితులకు అందించేందుకు మంత్రి సీతక్కకు అందించారు. గూడూరు మండలం బ్రహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం రూ.20 వేలు, ముత్యాలమ్మగుడి మరమ్మతులు, వాటర్ సౌకర్యం, సుందరీకరణ పనుల నిర్వహణ కోసం రూ.6.10 లక్షలు, గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం రూ.25 వేలు అందించారు. ఇదే గ్రామంలో క్యాన్సర్ బారిన నపడ్డ పొడుగు సోమక్కకు వైద్యం కోసం రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు.

## 17.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 3 : జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం 8:30 గంటల వరకు 272. 8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా సగటున 17.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని కొత్తగూడ మండలంలో 7.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, గంగారంలో 2.2, బయ్యారంలో 4.2, గార్లలో 7.6, డోర్నకల్‌లో 18.6, కురవిలో 10.8, నెల్లికుదురులో 58.6, నర్సింహులపేటలో 46.0, చిన్నగూడూరులో 40.2, మరిపెడలో 20.4, దంతాలపల్లిలో 17.2, తొర్రూరులో 11.4, పెద్దవంగరలో 28.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

## పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడిగా బద్రినారాయణ


సంకా బద్రినారాయణ, మిర్యాల సతీష్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 3 : మహబూబాబాద్ జిల్లా ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్-తెలంగాణ స్టేట్ (పీఆర్టీయూ- టీఎస్) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, గుండు లక్ష్మణ్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ పట్టణంలో బుధవారం నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా సంకా బద్రినారాయణ, ప్రధాన కార్యదర్శిగా మిర్యాల సతీష్‌రెడ్డిలను నియమించినట్లు తెలిపారు. వీరితో పాటు 18 మండలాల పరిధిలో 45 మందితో కూడిన పూర్తిస్థాయి జిల్లా కమిటీని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బద్రినారాయణ మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో మరోసారి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## భారీ వర్షానికి కూలిన ఇల్లు

చిన్నగూడూరు, అక్టోబరు 3 : మండల కేంద్రంలోని ఉగ్గంపల్లిలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రామానికి చెందిన కొంపెల్లి రాంమూర్తి ఇల్లు కూలింది. ఇంట్లో ఉన్న బియ్యం తదితర వస్తువులు తడిసిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు గురువారం బాధితుడిని పరామర్శించి, కూలిన ఇంటిని పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ తరుపున తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామ ఇందిరమ్మ కమిటీ ఉపాధ్యక్షుడు భర్తపురం యాకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు గండ్లె భద్రయ్య, మండల యూత్ ఉపాధ్యక్షుడు జక్కుల మురళి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కంచనపల్లి రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వీరాచారి, బాలు ఉన్నారు.

## జాబ్‌మేళాను సక్సెస్ చేయాలి

- గూడూరు సీఐ బాబురావు

గూడూరు, అక్టోబరు 3 : జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 8న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ బాబురావు అన్నారు. గూడూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆధ్వర్యంలో సుమారు 40కి పైగా కంపెనీల ద్వారా 2 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. విద్యార్హతలు పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఫార్మసి అభ్యర్థులు అర్హులని తెలిపారు. గూడూరు, కొత్తగూడ, గంగారం నిరుద్యోగ యువత ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లలో ఒకరోజు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

## మెగా జాబ్‌మేళాపై పోలీసుల ప్రచారం

- క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫాం నింపండి : ఎస్సై



జాబ్‌మేళా ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న పోలీసులు

కేసముద్రం, అక్టోబరు 3 : మహబూబాబాద్‌లో ఈనెల 8న నిర్వహించే మెగా జాబ్‌మేళాపై గురువారం ఎస్ఐ జి.మురళీధర్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రచారంచేపట్టారు. ఇందులో భాగంగా జాబ్‌మేళా వివరాలు తెలిపే విధంగా ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ టెన్త్ నుంచి పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు చేసిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి బయోడేటా ఫాంను నింపి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేయడమే లక్ష్యం : ఎంపీ

గార్ల, అక్టోబరు 3 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేసి తీరుతామని మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. గార్ల మండలం తిర్లాపురంలో గురువారం గోర్ బాయ్ మంత్రో అభినందన సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తిపోతున్నాయని చెప్పారు. టీపీసీసీ మాజీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య, లచ్చిరాంనాయక్, తూరపురెడ్డి వెంకట్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణగౌడ్, పృధ్వినాయక్, గుండా వెంకట్‌రెడ్డి, శంషాద్‌బేగం పాల్గొన్నారు.

## మొక్కను నాటిన హరిహరన్ సాహు


కొత్తగూడలో మొక్కను నాటుతున్న మాస్టర్ హరిహరన్ సాహు

కొత్తగూడ, సెప్టెంబరు 3 : మండల కేంద్రానికి చెందిన మాస్టర్ కుసుమ హరిహరన్ సాహు తన పుట్టినరోజున ఇంటి ఆవరణంలో గురువారం మొక్కను నాటారు. దేశంలో మొక్కలు నాటే కార్యక్రమంపై పాఠశాలలో ప్రసంగాలు విని, మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొన్న సాహు తన పుట్టిన రోజున చిన్నారులకు మొక్కలపై అవగాహన కల్పించేలా మొక్కను నాటారు. కార్యక్రమంలో హరిహరన్ సాహు తాతయ్య, నానమ్మలు కుసుమ రాజన్‌బాబు, రాజేశ్వరి, తల్లిదండ్రులు రజనీ, ప్రదీప్‌కుమార్, అక్క హిరణ్య ప్రకాయ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# తొర్రూరులో కాసం ఫ్యాషన్స్ ప్రారంభం

- సందడి చేసిన హీరోయిన్ ప్రియాంక మోహన్


తొర్రూరులో జ్యోతి ప్రజ్వలన చేసిమాల్‌ను ప్రారంభిస్తున్న ప్రియాంక మోహన్

తొర్రూరు, అక్టోబరు 3 : పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 13వ స్టోర్‌ను గురువారం సినీనటి ప్రియాంక మోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. షాపింగ్ మాల్‌లో ఉన్న వెరైటీలను చూస్తూ సందడి చేశారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ప్రియాంక మోహన్ వస్తుందని తెలిసి ఉదయం నుండే అభిమానులు, పరిసర ప్రాంత యువతీయువకులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్టోర్‌ను తాను తొర్రూరులో ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్‌లు నమఃశివాయ, మల్లికార్జున్, కేదార్‌నాథ్, శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో 4సంవత్సరాలుగా ప్రజలమన్ననలు పొందుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 13 స్టోర్‌లు ప్రారంభించామని, ఈ వారంలో నర్సంపేట, వనపర్తిలో కూడా స్టోర్‌లను విస్తరించబోతున్నామన్నారు. అధునాత ఫ్యాషన్ డిజైన్‌లను వినియోగదారులకు తక్కువ ధరలకే నాణ్యమైన బట్టలు అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాల్ నిర్వాహకులు సాయికృష్ణ, ధీరజ్, ప్రీతమ్, అరుణ్ కుమార్, వరుణ్ పాల్గొన్నారు.

## పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డికి గాయాలు


అపోలో ఆస్పత్రిలో ఝాన్సీరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వేదిక కుప్పకూలడంతో ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి గాయాలయ్యాయి. మాల్‌ను ప్రాంభించేందుకు సినీహీరోయిన్ ప్రియాంకమోహన్, ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని ప్రారంభోత్సవానికి యాజమాన్యం ఆహ్వానించగా.. ప్రియాంక మోహన్, ఝాన్సీరెడ్డి హాజరయ్యారు. తొలుత వారు షాపింగ్‌మాల్ ఎదుట ఏర్పాటు చేసిన వేదికపైకి ఎక్కి అక్కడికి చేరుకున్న ప్రజలకు అభివాదం చేశారు. అదేసయంలో ప్రజలు ముందుకు దూసుకురావడంతో ఒక్కసారిగా వేదిక కుప్పకూలింది. దీంతో ఝాన్సీరెడ్డి కాలు రెం డుచోట్ల విరగడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, అపోలో ఆస్పత్రిలో ఝాన్సీరెడ్డిని మంత్రి పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మురళీనాయక్, యశస్వినిరెడ్డి పరామర్శించారు.

# శ్వాసిస్తున్న సమాధి..! వీడియోలు వైరల్

- దర్గాలో మహిమ అని చెబుతున్న నిర్వాహకులు


జమలాపురం సమీపంలోని దర్గాలో శ్వాస వస్తున్నట్లుగా చూపుతున్న సమాధి

కేసముద్రం, అక్టోబరు 3 : కేసముద్రం స్టేషన్ జమలాపురం సమీపంలోని హజ్రత్ ఖాజా హసన్‌బాబా సమాధి శ్వాస తీసుకుంటున్నట్లుగా వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బుధవారం రాత్రి దర్గాలో సకీన సందల్ (గంధం పండుగ) నిర్వహణలో భాగంగా వంద మంది భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం హసన్ బాబా సమాధి నుంచి శ్వాస తీసుకుంటున్నట్లుగా పైనున్న దుప్పటి కదులుతున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇది దర్గాలోని బాబా మహిమ అంటూ అక్కడికి వచ్చిన భక్తులు ప్రార్థనలు చేశారు. కొన్నేళ్ల క్రితం ఇదే దర్గాలో సకీన సమాధి శ్వాస తీసుకున్నట్లుగా వీడియోలు వచ్చాయి. కాగా, ఈ విషయంపై విజ్ఞానవేత్తలు మాట్లాడుతూ సమాధి శ్వాస తీసుకోవడం అనేది జరగదని, భూమి పొరల్లోని వాయువుల కారణంగా అలా కనిపించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.